## క్లుప్తంగా

### విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



విద్యార్థినికి దంత పరీక్ష చేస్తున్న వైద్యురాలు

**అగనంపూడి:** విద్యార్థులు దంత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దంత వైద్య నిపుణులు డాక్టర్ సత్య సూచించారు. జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు యాపిల్ ఇంటర్నేషనల్ దంత వైద్యాలయం ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దంత సంబంధ వ్యాధులు రాకుండా ఉండేందుకు దంతాలను రోజుకు రెండు సార్లు తోముకోవాలని తెలిపారు. దంతాలను శుభ్రం చేసే విధానాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కళారమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న భక్తులు

**అగనంపూడి:** జీవీఎంసీ 87వ వార్డు కణితిలోని అంబేద్కర్ కాలనీ గ్రామదేవత శ్రీ కళారమ్మ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పాదాలకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామ వీధుల్లో భారీగా ఊరేగించారు. తరువాత అనుపు చేశారు. కార్యక్రమంలో కణితి గ్రామదేవతల ఆలయ కమిటీల ప్రతినిధులు విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బలిరెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### కళావేదికకు పూలే పేరు పెట్టాలని వినతి



స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఉక్కునగరం:** పెదగంట్యాడ ఆర్‌హెచ్ కాలనీలో ఉన్న ఉక్కు కళావేదికను మహాత్మా జ్యోతిరావు పూలే కళావేదికగా మార్చాలని స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. వారు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను గురువారం కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, జి.అప్పలరాజు, బి.కామేశ్వరరావు, వి.సింహాచలం, వి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

### అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్‌వో నాయుడికి చెక్కు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

**సింహాచలం:** శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం పీఎం పాలేనికి చెందిన బలిజి నాగేశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు. సింహగిరిపై విచారణ కార్యాలయంలో సంబంధిత చెక్కుని దేవస్థానం పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.



# ఎండైనా.. వానైనా..

- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు
- ప్లాట్‌ఫాంలపై అరకొర షెల్టర్లు
- రూఫ్ విస్తరణకు వినతులు



దువ్వాడ రైల్వేస్టేషన్ ముఖద్వారం



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై నిలిచిన నీరు

**అగనంపూడి:** దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై అరకొరగా ఉన్న షెల్టర్లతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ ద్వారానికి రెండువైపులా పది మీటర్ల నిడివిలో మాత్రమే షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం 360 మీటర్ల పొడవు ఉంది. అలాగే నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం కూడా 3వందల మీటర్ల పొడవులో విస్తరించి ఉంది, కానీ రూఫ్ (షెడ్లు) మాత్రం కేవలం 20 మీటర్ల పొడవులో మాత్రమే ఏర్పాటు చేశారు. మిగిలిన ప్లాట్‌ఫాంలపై అక్కడక్కడ కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేసినా, రూఫ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

**రేకుల షెడ్లు నిర్మించాలి**

మధ్యాహ్న సమయంలో ప్రయాణించేవారు ఎండలో కూర్చోలేక రైళ్లు ప్లాట్‌ఫాంపైకి వచ్చేవరకు షెల్టర్లలో కూర్చొని, ఆపై లగేజీలతో పరుగులు తీయాల్సి వస్తోంది. వర్షం పడితే వారి అవస్థలు దేవుడికే తెలియాలి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ప్లాట్‌ఫాంలపై రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్టేషన్ ముఖద్వారం ఆరుబయట నుంచి ఉన్న ఎన్టీపీసీ ట్రాక్‌ను దాటడానికి నిర్మించిన వంతెన రూఫ్ కూడా ఎక్స్‌టెన్షన్ చేయకపోవడంతో వర్షం పడితే ప్రయాణికులు తడిసి ముద్దవుతున్నారు. వంతెన నుంచి ప్లాట్‌ఫాం వరకు కూడా కనెక్టింగ్ రూఫ్ లేకపోవడంతో వర్షానికి తడిపోవల్సి వస్తుంది. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం కుడివైపు 15 మీటర్ల పొడవుతో రూఫ్ నిర్మించే పనులు చేపట్టారు. అయితే రెండు వైపులా, ఒకటి, నాలుగు ప్లాట్‌ఫాంలపై షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై షెల్టర్ లేక నిలిచిన వర్షపు నీరు

### ప్లాట్‌ఫాంలపై రూఫ్‌లను విస్తరించాలి



ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారాల్లో షెడ్లను విస్తరించాలి. రెండు వైపులా కనీసం 50 మీటర్ల వరకు రూఫ్‌లను నిర్మిస్తే ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది. ముఖ ద్వారం వద్ద మాత్రమే నిర్మించడం వల్ల ప్రయాణికులంతా ఒకే చోట ఉండిపోవల్సి వస్తోంది. రైలు వచ్చే సమయానికి లగేజీలు, పిల్లలతో పరుగులు తీస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు సానుకూలంగా స్పందించి, చర్యలు తీసుకోవాలి.

– వాడపల్లి రామచంద్రరాజు, కూర్మన్నపాలెం

### వంతెన రూఫ్ పెంచాలి



స్టేషన్ ఆరుబయట నుంచి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వరకు నిర్మించిన ఎన్టీపీసీ ట్రాక్ క్రాసింగ్ వంతెన రూఫ్‌ను ఎక్స్‌టెండ్ చేయాలి. ప్లాట్‌ఫాం ఒకటి వరకు రూఫ్‌ను పొడిగించాలి. ఎండ, వానల నుంచి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వర్షం వస్తే వంతెన నీటితో నిండిపోతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. షెల్టర్ విస్తరిస్తే ఆ ఇబ్బంది ఉండదు.

– కొయ్య రాంబాబు, అగనంపూడి

## తెరిపివ్వని వర్షం



నెల్లిముక్కు జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



సీతానగరం జీవీఎంసీ కల్యాణ మండపం ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీరు

**పెదగంట్యాడ:** వాన వదలలేదు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తూనే ఉంది. ఉదయం ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు చిరుజల్లులుగా ప్రారంభమైన వర్షం ఏకధాటిగా కురిసింది. రోజు మొత్తం వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. మండలంలోని నడుపూరు, రామచంద్రనగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు.

## గాంధీజీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

**అక్కిరెడ్డిపాలెం:** వాసవీ క్లబ్ ప్రతినిధులు అక్కిరెడ్డిపాలెంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు నున్నా గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి క్లబ్ ప్రతినిధి కొల్లూరు సోమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహావిష్కరణను పురస్కరించుకుని అక్కిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కెచ్ పెన్నులు, వీధి వ్యాపారులకు గొడుగులు, ట్రాఫిక్ కమ్యూనిటీ గార్డులకు మాస్క్‌లు, టవల్స్ అందజేశారు. అలాగే, బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయానికి ఇత్తడి పళ్లేలను బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి.కుమార స్వామి, కోశాధికారి నున్నా శ్రీరామ్మూర్తి, ప్రతినిధులు కటకం శైలజ, ఉద్దగిరి కుమార గుప్తా, ఆర్.సి.నాగేశ్వరరావు, ఎస్.సతీష్ కుమార్, రమేష్ కుమార్, క్లబ్‌కు చెందిన పలువురు డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ‘టోల్‌ప్లాజా కేసు స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవాలి’



టోల్‌గేటు వద్ద మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

**అగనంపూడి:** అగనంపూడి టోల్‌ప్లాజా కొనసాగింపు విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సుప్రీంకోర్టులో వేసిన కేసును స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నేతలు పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ కోరారు. అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద వారు మాట్లాడుతూ పుష్కర కాలంగా అగనంపూడి పరిధిలో టోల్‌గేటు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ప్రజా సంఘాలు, స్థానికులు ఘోషిస్తూనే ఉన్నారన్నారు. దీంతో 2019లో హైకోర్టు తీర్పుతో అధికారులు టోల్‌ఫీజును ఎత్తివేశారని, అయితే అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మక్కై సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని ఐదేళ్ల నుంచి టోల్ వసూళ్లు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టును తప్పుదోవ పట్టించి స్టే తెచ్చుకున్న అధికారులు బేషరతుగా కోర్టుకు క్షమాపణ చెప్పి, కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్మన్ కిడిమి హనుమంతరావు, నాయకులు శ్రీనివాసరావు, విందుల మోహనరావు పాల్గొన్నారు. అలాగే టోల్‌గేటు పేరుతో ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న రూ.5 భారాన్ని ప్రజా రవాణా సంస్థ వెంటనే ఎత్తివేయాలని రామఅప్పారావు కోరారు.

## బీజేపీ ఎంపీల చొరవ అభినందనీయం

**గాజువాక :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వంలో కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, సెయిల్ డైరెక్టర్ కాశీరాజు తదితరులు ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖామంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి మాట్లాడటం అభినందనీయమని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. గాజువాక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని కోరారని, ఇది జరిగితే విశాఖస్టీల్‌ప్లాంట్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు గంధం వెంకటరావు, విల్లా రామ్మోహన్ కుమార్, పి.ఎన్.ఆర్.లక్ష్మణరావు, కె.వి.ఎస్.ఎన్.రాజు, టి.వై.బాబు, పి.ఉగ్రం, పెంటయ్య, బొండా ఎల్లాజీరావు, టి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ వద్ద మృతురాలి బంధువుల ఆందోళన



గాజువాక పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న మృతురాలు పద్మిని బంధువులు

**అక్కిరెడ్డిపాలెం:** భర్త, అత్తామామల వేధింపుల కారణంగానే పద్మిని మరణించిందని, ఆమె మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మృతురాలి, బంధువులు గాజువాక పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. అదనపు కట్నం తేవాలని, లేదా విడాకులివ్వాలని వేధించడంతో ఈ నెల 1న పురుగుల మందు తాగిన పద్మిని (26) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆమె బంధువులు ఆగ్రహంతో గాజువాక పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పద్మిని మృతికి కారణమైన ఆమె భర్త సోమేష్, అతని తల్లిదండ్రులను కఠినంగా శిక్షించాలని, తమ కళ్ల ఎదుటే శిక్షించాలని నినదించారు. దీంతో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ శ్రీనివాసరావు మృతురాలి బంధువులతో మాట్లాడారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పద్మిని భర్తను, అత్తమామలను అరెస్ట్ చేశామన్నారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో మృతురాలి బంధువులు శాంతించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## అప్పన్న స్వామికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

**సింహాచలం:** శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

## పేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీ ప్రారంభిస్తున్న బిషప్ మహంతి

**గాజువాక :** స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు గురువారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందని, అందులో భాగంగా కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నామని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

## బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



బాల్య వివాహాలు వద్దంటూ కళాజాతలో వివరిస్తున్న కళాకారులు

**పెదగంట్యాడ:** ‘బాల్య వివాహాలు వద్దు.. బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం’ అంటూ ప్రదర్శించిన కళాజాత ఆలోచింపజేసింది. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని 64వ వార్డు గంగవరంలో చేపలపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ కార్యకర్త శ్రీరం దుర్గమ్మ ఆధ్వర్యంలో గురువారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కు చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి పాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పడాల శాంతి, పేర్ల దేముడమ్మ, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## సెయిల్‌లో విలీనంతో ‘ఉక్కు’కు పూర్వవైభవం



మాట్లాడుతున్న ఉక్కు పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

**అగనంపూడి:** విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయగలిగితే పునరుజ్జీవం పొంది, పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1232వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. వీరిద్దరూ తలచుకుంటే ఉక్కు ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగడంతో పాటు పూర్వవైభవం ఉక్కుకు రాగలదన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎన్నో అవరోధాలు, ఆటంకాలను దాటుకుని ఉక్కు పరిశ్రమను విస్తరించుకుంటే పారిశ్రామికవేత్తల ఆకలిని తీర్చడానికి విశాఖ ఉక్కును బలిపశువును చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయ, బి.ఎస్.రాజు, డి.సి.హెచ్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అప్పారావు, గోవింద్, రమణ, దాసరి శ్రీను, గంగాధర్, అప్పారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఒకటో తేదీ నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు



సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

**గాజువాక:** జూలై ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు నగరంలోని మురళీనగర్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ తెలిపారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చలు జరుపుతామన్నారు. గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్లు, ప్రతికూల పోకడలపై చర్చించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చించి, తీర్మానాలను చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మతోన్మాద పార్టీ బీజేపీతో అంటకాగుతోందని, గత ప్రభుత్వంలో దొర్లిన తప్పులనే మళ్లీ చేయకుండా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, పి.దుర్గారావు, కె.పోతయ్య, కె.రాజబాబు, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులకు చెక్



మాట్లాడుతున్న హోమియో వైద్యురాలు కళావతి

**అగనంపూడి:** సీజనల్ వ్యాధుల విషయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అగనంపూడి హోమియో వైద్యురాలు డాక్టర్ కె.కళావతి అన్నారు. పెదమడక పాఠశాలలో అగనంపూడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తాయని, వాటి వల్ల డెంగ్యూ, మలేరియా, పైలేరియా, కలరా, విష జ్వరాలు, దగ్గు, జలుబు వంటి రకరకాల వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, కలుషిత ఆహారం తీసుకోవద్దని సూచించారు. భోజనం చేసే ముందు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ గుదే సుశీలా గజేంద్రరావు, ప్రతినిధులు బొండా ఈశ్వరరావు, ఎం.మస్తాన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

**అక్కిరెడ్డిపాలెం:** గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఈ నెల 19వ తేదీన అర్ధరాత్రి కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన గుర్తు తెలియని యువకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 26న మరణించినట్లు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మల్కాపురం నుంచి గాజువాక వైపు నడిచి వస్తున్న గుర్తు తెలియని యువకుడిని కారు వెనుక నుంచి ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి చేతికి, తలకు తీవ్ర గాయాలవడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఆ యువకుడు చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందినట్లు సీఐ చెప్పారు. అయితే ఆ వ్యక్తి వివరాలు తెలియలేదన్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావును సంప్రదించాలని కోరారు. లేదా 94407 96018కు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు.